# ది ఎపిడమిక్

## Hyd Virus

డా॥ చిత్తర్వు మధు



## ది ఎపిడమిక్

- డాక్టర్ చిత్తర్వు మధు

నిశీధి.

కాటుక కంటి కంటే ఇండియన్ ఇంక్ కంటే కారు మబ్బుకంటే నల్లని చీకటి.

నల్లటినీడల్లో కొంచెం తక్కువ ఛాయలో నల్లటి నిటారైన చెట్లు, కాళ్ళకి తగిలి సూదుల్లా గుచ్చుతున్న రాళ్ళు, వెన్నెముకనొణికించే చలి... ఎటో తెలియక పోతున్నా సరేముందుకి భారంగా అడుగు తీసి అడుగు వేస్తున్నాడు డాక్టర్ రావ్.

ఒకప్పుడు తన బందీలుగా వుండి ఇప్పుడు తప్పించుకుపోతూ, తన మీద పగతో ఆ గ్రహాంతరవాసులు చేసిన అట్టహాసం తన చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తోనే వుంది.

పోలోనియా, పోలోనియస్

జూలియా, జూలియస్

వాళ్ళ గురువులా వున్న ముసలివాడు హోరా...

జూబిలీహిల్స్ కొండ రాళ్ళ మధ్య తన చుట్టూ చేరడం...

వాళ్ళ కళ్ళనుంచి నిప్పురవ్వలు లేసర్‌కిరణాల్లా తన మీద దాడి చేయడం...

“ఆగండి!” అని వారించిన హోరా అనే ఆ ముసలివ్యక్తి....

“ఇతనికి చావు సరైన శిక్షకాదు! కాల పంజరంలో బందీని చేయడమే... తగిన శిక్ష....!” అని వాళ్ళని ఉసిగొల్పడం....

వికటంగా సంతోషంగా వాళ్ళు “బలే బలే ఇదే సరైన శిక్ష అని కేరింతలు కొట్టడం..

మరుక్షణంలో మూడుజతల కళ్ళనుంచి వచ్చిన వెలుగు తనకళ్ళని మిరుమిట్లు గొలపడం

“ఢభ్”మన్న పెద్ద చప్పుడు శరీరంలోని కండరాలన్నీ మెలితిరిగినట్లు బాధ, ఎముకల్లో హెలికాపర్ట్ బ్లేడులు గిరగిరా తిరిగినట్లు ప్రకంపనలు....

.... అగాధంలో కూరుకుపోతున్న భావన....

మెలికలు తిరుగుతూ, గిరగిరా గిరగిరా భూమికి అడుగున పాతాళంలోకి పోతున్న ఫీలింగ్,

కడుపులో తిప్పటం, వర్టిగో! నాసియా(వాంతి వచ్చే ఫీలింగ్) !

ఇలా అవస్థలు పడి పడి, కొన్ని నిముషాలకి,

ధన్ మన్న చప్పుడులో ఈ నిశీధిలో కీకారణ్యంలో విసిరివేయబడ్డాడు.

డాక్టర్ రావ్‌కి స్పృహ తప్పింది. కొద్ది నిమిషాల తర్వాతే తెలివి వచ్చింది. ఒళ్ళంతా భయంకరమైన నొప్పులతో ఎముకల విరిగాయా అని తడిమిచూసుకున్నాడు..

.. విరగలేదు. కాలు ముందుకువేసి చేతులు ఆనించి లేచినిల్చున్నాడు.

తల తిరుగుతోంది, చుట్టూ చీకటి. చెట్ల నీడలు. కీకారణ్యం.... అవును కాటుకలాంటి, ఇండియన్ ఇంక్ పూసిన బొమ్మలాంటి అంధకారం. అప్పుడు చెవులకి మెల్లగా వినికిడిలోకి వచ్చిన చప్పుడు....

కీచురాళ్ళ మోత. పురాతనమైంది! ఎన్ని శతాబ్దాల క్రితం కాలంలోకి వెనక్కి వెనక్కి విసిరేయ బడ్డాడూ తను!

బహుశా తనువాళ్ళని నిర్దేశించి ఇదివరకు దేశనాయకులని చేసినట్లుగా తననికూడా 18వ శతాబ్దంలోకి విసిరివేశారా?

రెండొందల సంవత్సరాల క్రిందటి దక్కన్ పీఠభూమియా ఇది లేక దండకారణ్యమా ఇక్కడ ఎవరుంటారు?

లేక ఎవరూ లేరా... క్రూరమృగాలు తనని తినేస్తాయా...?

కాళ్ళలో నిస్సత్తువ, తలలో తిరగడం...

కాలప్రయాణానికి అలిసిన దేహంలో కరకరా ఆకలి... దానికి మించిన... భయం భయం... ఏపులి చెట్ల వెనకనుంచి తనమీద పడుతుందో... ఏ సింహం ఏ అకలికొన్న చిరుత తనని చీల్చిచెండాడి ఆహారంగా చేసుకుంటుందో..

భయం... ప్రాణాలకోసం... నిత్యం సకలసుఖాలతో ఏసి గదులలో నౌకర్లతో సకల సేవలు చేయించుకునే డాక్టర్‌రావ్‌కి ఈ ఆడవిలో ఒంటరి ప్రయాణం చిత్రవధలా అనిపిస్తోంది.

..దీనికంటే... తనని ఆ ఇరవై శతాబ్దపు జూబిలీహిల్స్‌లో వారి శక్తులతో కాల్చి బూడిద చేస్తేనే బావుండేది...

ఇప్పుడెలా? ఈ కాల పంజరంలో ఎలా బతికేది?.. ఏంచేయాలి?

కాలికి అడ్డంగా తాడులాంటి చెట్టువేరు అడ్డుపడటంతో “దభీ”మని కిందపడ్డాడు రావ్. నుదుటిమీద గాయం, మోచేతులు మోకాళ్ళు గీరుకుపోయాయి. నవనాడుల్లోంచి తట్టుకోలేని బాధ, కళ్ళముందు చుక్కలు కనిపించాయి.

అలాగేవుండిపోయాడు. పైన నల్లటి చెట్లకొమ్మలు అల్లిబిల్లిగా పందిరిలా ఆకాశాన్ని కనబడనీకుండా అల్లుకొనిపోయివున్నాయ్. మిణుగురు పురుగులుకొన్ని అక్కడక్కడా మెరుస్తూ దేవుడు కల్పించిన విద్యుత్‌దీపాల్లా వున్నాయి.

జేబుతడుముకున్నాడు. సెల్‌ఫోన్ వుంది కానీ సిగ్నల్‌లేదు. సిగ్నల్‌రాదు. 200సంవత్సరాల వెనక్కి ఎలా వస్తుంది. బేటరీపని చేస్తోంది. దాన్నినొక్కితే అస్పష్టమైన వెలుగు చిన్నటార్చిలైటులా వస్తోంది. ఎలాగో లేచి నిల్చున్నాడు. తూలిపోతున్నా సరే ముందుకి అడుగులు వేయాలి.

కాలంలో రెండొందల ఏళ్ళు విసిరి వేయబడ్డా ఇంకా తను బతికే వున్నాడంటే దేవుడు ఏదో లక్ష్యంతోనే తనని కాపాడుండాలి!

ఈ కీకారణ్యంనుంచి బయటపడగలిగితే ఎలాగో బతకొచ్చు.

18 వశతాబ్దంలో మనుషులు బతకలేదా? నీళ్ళు నిప్పు తిండీ దొరకవా.?

తన శరీరం బలహీనమైనాగాని మెదడు బాగానే పనిచేస్తోంది. ఆలోచనా శక్తి జ్ఞాపకశక్తీ బాగానే వున్నాయి.

ఎలాగో బతకొచ్చు... బతకాలి! బతికి తీరాలి.!

అసాధ్యాల్ని సుసాధ్యాలు చేయడమే మానవజీవిత వైచిత్ర్యం.

ఐసియులో ఆనాడు రేడియో తరంగాలతో రోగాలని ప్రభావితం చేసే రేడియో మేకర్ కనిపెట్టి లక్షలకు లక్షలు ఆర్జించి, తనస్వంత పరిశోధనాలయం మోడరన్ హార్ట్ క్లినిక్ నిర్మించినా,

ఆల్జీరియాలో ఎడారిలో గ్రహాంతర వ్యక్తుల్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుని వారి చేత ప్రపంచమంతా దోపిడీలు చేయించి వారి అద్భుతశక్తులతో కోట్లకు కొట్లు ఆర్జించినా

ఒకే ధృడవిశ్వాసం, పట్టుదల క్రూరత్వం రావ్‌ని ముందుకు నడిపించాయి.

ఇప్పుడు అనుకున్నవి తారుమారాయి, గ్రహాంతర వ్యక్తులు తనమీదే తిరగబడి తనని కట్టుబట్టలతో ఇలా కాలంలో వెనక్కినెట్టివేయడం భయంకరమైన షాక్.

దానికి తల్లడిల్లిపోయాడు. అతనేకాదు ఎవరయినా తల్లడిల్లిపోతారు.

తను స్విస్ బ్యాంక్‌లో దాచిన డబ్బులు, బంగారం అంతులేనిది. తనకి వున్న అద్భుతమైన విజ్ఞానం – అది కాక నిజానికి ఆ గ్రహాంతర వ్యక్తులని గురించిన తనకి తెలిసిన విజ్ఞానం గురించి అందరికీ చెబితే చాలు... కావల్సినంత డబ్బు!

కాని ఏం లాభం... ఇప్పుడు ఈ దిక్కూ కాలం తెలీని ఈ నట్టడివిలో తన విజ్ఞానం తెలివీ దేనికీ పనికిరావ్.

ఎలాగైనా బతకాలి. ముందు ప్రాణం కాపాడుకుంటే తరవాత మిగిలినవి ఆలోచించు కోవచ్చు. ఏదో ఒకటి తినాలి ఎలాగో జీవించాలి. ఏదో మార్గం చూడకపోతే ఈ లోపల ఏ క్రూరమృగాలూ, విషసర్పాలూ తనని కాటేయకుండా ఉంటే.....

ఈ గోతుల్లో చెట్లల్లో పొదల్లో కాలు విరిగి జారిపడి, గాయాలు సెప్టిక్ అయి మరణించకుండా వుంటే....

ఇవన్నీ ఆలోచించి బాధపడటం వృథా. అడుగు ముందకు వేయాలి.

అడవి బయట తెల్లవారుతోందేమో కొద్దిగా మసకవెలుతురు చెట్ల తలలసందుల్లోంచి నేలమీద పడుతోంది.

డాక్టర్ రావ్ నిబ్బరంగా లేచి మళ్ళీ అడుగులు ముందకు వేశాడు.

పొట్టిగా లావుగా వున్న శరీరం సంవత్సరాల తరబడి సుఖంగా తిని విశ్రాంతంగా వుండడం వల్ల వచ్చిన చిరుబొజ్జా ఆయాసం.. నుదుటి మీద గాయంలోంచి వస్తూన్న నెత్తురు గట్టిగానొక్కిపట్టి ఆగేట్లు చేసుకున్నాడు.

అ అరణ్యంలో కాలిబాటేలేదు. చెట్ల ఆకుల్లోంచి కొమ్మలలోంచి ముందుకి భారంగా అడుగులు వేస్తూ వెళ్తున్నాడు.

సెల్‌ఫోన్ లైట్ ఒక్కటే కొంచెం సహకరిస్తోంది.

ఎక్కడో దూరంగా కొమ్ముబూరలా గంగిరెద్దువాళ్ళ సన్నాయిలా వినిపించిన ధ్వని. చాలా దూరాన మనుషులు తప్పెటలు డప్పులతో పాటలుపాడుతున్న ధ్వని.

లేక తన భ్రమా..

హడావిడిగా ముందుకు అడుగులు వేయబోయాడు రావ్. ఏదో నరసంచారం వున్నది ఈ అడవిలో వాళ్ళు 18వ శతాబ్దపు అడవిజాతి మనుషులా, కోయలా, భిల్లులా?

ఏదయినా కాని తనకి అదృష్టం తిరిగింది. ఇక బ్రతికే ఆశ చిగురించింది.

ముందుకి వేగంగా అడుగువేసిన రావ్ కాలికి ఈ సారి నేల తగలలేదు.

ఆకుల మధ్య అగాధంలోవున్న పెద్దగొయ్యి.

అలిబిల్లిగా నున్నగా చెట్లవేళ్ళ మధ్య పెద్ద లోతైన గొయ్యి.

కెవ్‌మని అరిచి తలకిందులుగా పడిపోయాడు రావ్.

గోతికి అడుగున చిత్తడినేల పైనుంచి కిందికి పదడుగులు లోతు వుంటుంది. అటుయిటూ ముళ్ళపొదలు.

తిరగి నిటారుగా నిల్చుని కళ్ళు చిట్లించుకుని పైకి చూశాడు.

అసలే అడవి అందులో చీకటి ఇప్పుడు ఏదో ఒక అగాధం అయిన గోతిలో పడ్డాను.

చేయిమీద జరజరా ఏదోపాకింది "బాబోయ్" అని అరిచి ఎగిరి గంతేశాడు. తాచుపాము బుస్‌మని చప్పుడు చేసి ఏటో మాయమయింది.

గుండెదడ, భయం, వికారం ఇలాంటి బాధలతో రావ్‌కి.. మళ్ళీ అప్పుడే స్పృహతప్పింది.

*　*　*

చెట్లతలలు ఆకుపచ్చటి పందిరిలా శరీరంలో అణువణువునా కత్తిపోటుల్లా నొప్పులు. కళ్ళు తెరిచి చూస్తే ఆకాశంలో చెట్ల ఆకులు కొమ్మలు. విదిలించు కోవాలని చూస్తే తాళ్ళతో కట్టేసిన కాళ్ళూ చేతులూ.

రెండు గట్టి చెక్కకర్రలకి తలకిందులుగా చేతులు కాళ్ళు కట్టి, అటు యిటూ భుజాలమీద వేసుకుని వేగంగా అడవిలోని గతుకులబాటలోన పరుగులాంటి నడకతో పోతున్నారు వాళ్ళు.

అందుకే డాక్టర రావ్‌కి తెలివి వచ్చినప్పుడు ప్రపంచం తల్రక్రిందులుగా కనిపిస్తోంది.

అడవిలోని ఏనుగులనో క్రూరమృగాలనో పట్టుకోడానికి ఏర్పరచిన గోయి అది. పొద్దున్న వచ్చి చూసేసరికి ఆ "గోతి"లో స్పృహతప్పిన డాక్టర్‌రావ్‌ని వాళ్ళు తాళ్ళతో పైకి లాగి కట్టి జంతువుని మొసుకుపోయినట్లూ మోసుకునిపోతున్నారు.

ఇరవై ఒకటో శతాబ్దంలోని ఇప్పటి కోయవాళ్ళవేషాల్లోనే వున్నారు వాళ్లు తలకి ఈకలు నల్లటి ఛాయలో కండలుతిరిగిన శరీరాలూ, మెడల్లో పూసలూ, ఎర్రటి రంగు నూలు పంచెల్లో కాళ్ళకి కడియాలు గలగలలాడుతుంటే వేగంగా నడుస్తున్నారు.

రావ్‌కి ఒళ్ళంతా కదిలిపోతోంది. చంపడానికి ఓ జంతువును తీసుకుని పోయినట్లు పోతున్నారు. మామూలుగా నడిపించవచ్చుగా!

"ఆపండ్రోయ్!" అని అరిచాడు.

"కట్లు ఊడదీయండి! నేనూ నడుస్తాను మీతో!"

ఓ క్షణం ఆగేరువాళ్ళు. వాళ్ళకి రావ్ బాధ భాష అర్థం అయిందో లేదో తెలియదు.

వాళ్ళు వేగంగా నడకసాగించారు.

వాళ్ళు నడచినంత సేపూ రావు అరుస్తూ మూలుగుతునే వున్నాడు.

అదో నరకయాతన, వొళ్ళంతా శూలాల్తో పొడిచినట్లు నొప్పులు, కళ్ళు తిరిగిపోతూ తలకిందులుగా ప్రయాణం.

ఓ పదిహేను నిముషాలు ఈ బాధ పడినాక "ధభ్‌మన్న' చప్పుడుతో నేలమీద పడ్డాదు రావ్.

ఎవరో కట్టు వూడదీశారు. చచ్చుపడిన అవయవాల్లో రక్తం మళ్ళీ ప్రసరించసాగింది. కొంచెం సేపటికి తల తిరగడం తగ్గింది.

మెల్లగా చేతులు నేలమీద అన్చి లేచి నిల్చున్నాడు. చుట్టు చూశాడు.

ఒకళ్ళ పక్కఒకరు కిక్కిరిసి నిల్చుని వున్నారు కోయజనం. వాళ్ళ వేషభాషలు 21శతాబ్ధపు కోయవారివలెనేవున్నాయి. అందరికళ్ళు అతనివంక చూస్తున్నాయి. ఎదురుగా ఎత్తైన అరుగుమీద చాలా లావుగా పెద్దపొట్టా బుంగమీసాలతో కూర్చుని అతనివంకే చూస్తున్నాడు. ఆవ్యక్తి. అతని వయసు రూపమూ వేషమూ ఎత్తైన గద్దెమీద కూర్చోడంబట్టి వాళ్ళకి అతనే రాజో, కులపెద్దో అని తేలికగానే చెప్పవచ్చు.

"ఎవరు నువ్వు? ఏ దేశం నీది? ఇంత అడవిలోకి ఎట్లా వచ్చినవ్? చెప్పు!" అని అతనన్న మాటలు రావ్‌కి బాగా అర్థం అయిపోయాయి.

రెండొందల సంవత్సరాల క్రిందటి దక్కన్ పీఠభూమిలోని అడవి. ఆహా అప్పటి కోయివాళ్ళ భాష ఇప్పటిలానే వుంది.! ఇది తన అదృష్టం కావచ్చు.

"నేనీకాలంవాడిని కాదు 21వ శతాబ్దం ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ నుంచి వచ్చాను. అడవిలో నడుస్తూ మీరు తీసిన గోతిలో చీకటిలో జారిపడ్డాను" అన్నాడు రావ్ నిబ్బరంగా,

ఇప్పుడతనికి మళ్ళీ ఆశ ధైర్యం పుంజుకున్నాయి!

"నువ్వెవరో ఏంది పలుకుతున్నవో ఎరికవుతలేదు సామీ!" నిన్ను ఏం చేయం మీ దేశం పంపిస్తాం కాని నిజం చెప్పు, నీ దుస్తులు వేషం భాష మాకు బోధపడటంలే!" అన్నాడు కోయరాజు.

"డాక్టర్ రావ్ నాపేరు. అంటే వైద్యుడ్ని. కొన్ని కారణాలవల్ల ఈ కాలంలోకి వచ్చిపడ్డాను అంతకంటే మీకు తెలిసేట్లు ఏం చెప్పలేను!"

కోయరాజు భ్రుకుటి ముడిచేడు. ఆలోచించాడు. అతని ఎదురుగా వున్న కోయలగుంపులో కలకలం. వాళ్ళందరి మనసుల్లో ఒకటే అనుమానం.

ఈస్టిండియా కంపెనీ, విదేశీయులైన ఫ్రెంచి డచ్చి దేశస్థులు భారతదేశంలో క్రమంగా వస్తూన్న రోజులవి. దగ్గరలోని గోల్కొండలో నవాబు పరిపాలనలో ఇమడలేక, అడవిలో స్వతంత్రంగా బ్రతుకుతున్న వాళ్ళువారు. వాళ్ళ సంస్కృతీ అలవాట్లు వేరు. వీడెవరో గూఢచారీ లేక దొంగ లేక అపాయకరమైన వ్యక్తీ అని వాళ్ళందరికీ అనుమానం తొచింది.

"ఈడు నిజం చెప్తలేడు! ఒళ్లుకుళ్ళ బొడవండి! నిజం చెప్పేదాకా తిండి నీళ్ళు ఇయ్యకండి, తండా బయట గుడిసెలో పడేసి బంధించండి!" అని ఉత్తరువులు జారిచేశాడు పెద్దకోయ.

మరుక్షణం రావ్ ఒంటిమీద కర్రలతో చేతులతో పిడిగుద్దులు పడసాగాయి.

అసలే నీరసంగా భయభ్రాంతులతో వున్న డాక్టర్ రావ్ వాళ్ళని చేతులు జోడించి "వద్దు వద్దు ప్లీజ్ నన్ను కొట్టకండి నేను చెప్పేది నిజం!" అని దీనంగా వేడుకోసాగాడు

ఎప్పుడో చేసిన పాపాలకో ఇన్ని శిక్షలు.

... కొన్ని వేలమైళ్ళదూరంలో విశ్వప్రేమి అంతరిక్షనౌకలో సుదూర న్యూటైటాన్ గ్రహం వైపు ప్లీడియాస్ గెలాక్సి వైపు ప్రయాణం చేస్తూ వెళ్ళిపోతున్న కాలజ్ఞాని హోరా, చిరునవ్వుతో కోడలు పోలోనియా వంక చూశాడు.

ఈ విశాల విశ్వంలో అనంత కాలచక్రంలో పుట్టిపెరిగి గిట్టే సకల జీవరాశులకీ ఏదో ఒక క్షణంలో చేసిన దానికి ఫలితం అను భవించక తప్పదు అన్నట్లు కాలం గడిచి పోతూనేవుంది.

స్పృహ తప్పిన రావ్‌ని ఓ చివర వెలేసినట్లుగా వున్న గుడిసెలో తీసుకుని వెళ్ళి పడేశారు ఆ 18వ శతాబ్దపు ఆటవికులు.

* * *

అడవిలో కోయగూడెం వెలుపల విసిరేసినట్లున్న గుడిసెలో పడివున్నాడు డ్టాకర్ రావ్.

రాత్రికీచురాళ్ళ మోత. ఉదయం పక్షుల కిలకిలలు. తడిక సందుల్లోంచి, చెట్ల సందుల్లోంచి తళతళమెరిసే సూర్యకిరణాలు.

ఓ కోయ యువకుడు పొద్దున్నే ఓ సత్తుగిన్నెలో గంజిలాంటి ద్రవపదార్థం తెచ్చియిచ్చేవాడు. ఎండ నడినెత్తిన వచ్చేవేళ ఓ కోయపిల్ల ఆకు పొట్లంలో రొట్టెలు కాయగూరలు – కొంచెం అడవి పక్షిమాంసం కూర కాబోలు తెచ్చి గుడిసె ముందు పెట్టి వెళ్లిపోయేది.

ఆకలి కాళ్ళనొప్పులు నీరసం తలతిరుగడం

ఓ కుండల్లో నీళ్ళుండేవి.

వాళ్లుపెట్టిన భోజనం రుచికరంగా లేకపోయినా బలంగానేవుండేది.

మొదటిరోజు మధ్యాహ్నానికి ఒకడువచ్చి కాళ్లు చేతులు కట్లువిప్పి 'జాగ్రత్త! పారిపోటానికి చూస్తే అడవి మెకాలు నమిలి మింగేస్తాయ్! తిని పడుకో!" అని బెదిరించి వెళ్ళిపోతున్నాడు.

"చూడు కొయదొరా, నేను డాక్టర్ని అంటే జబ్బులునయంచేసే వైద్యుడిని. నావల్ల మీకు ఏ ప్రమాదం లేదు. దయచేసి నన్ను అందరిలో కలవనీయండి" అని ప్రార్థించేడు రావ్.

"అవంతా 'కిమూరా'దొర చెబుతాడు మాదేం లేదు" కోయ వెళ్ళపోయాడు.

రావ్‌కి అలా ఎన్నిరోజులు గడిచాయో తెలియదు.

ఒరోజు దృఢకాయులైన కోయలు వచ్చి 'లే లే దొర పిలుస్తుండూ పదపద!" అని తొందర చేశారు.

మాసినగడ్డం, లోతుకుపోయిన కళ్ళు మానసిక ఆందోళన... రావ్‌కి అయినా ఆశ చావలేదు.

బలం బాగానేవుంది. శరీరం చెప్పిన మాట వింటోంది.

ఓ నెమిలి ఫించం సింహాసనం మీద ఎత్తైన గద్దెమీద కూర్చున్నాడు కిమూరా. బాగాలావు బానపొట్ట కిందకి వంపు తిరిగిన తెల్ల మీసాలు, మెళ్ళోపూసలదండలు, తలమీద తెల్లజుట్టులో పక్షిఈకలు అతను మాట్లాడితే ధ్వని కీచుమనివచ్చింది. నవ్వితే పిల్లులు పోట్లాడినట్టుంది. కోపం వస్తే కళ్ళు ఎర్రబడి చేతులు శరీరం అంతా వణికిపోతూవుంటుది.

"ఏం మడిసీ! నువ్వు ఇప్పటికైనా నిజం చెబుతావా?లేదా? నువ్వు ఫరంగీల కాడ నౌకరీ చేసే తొత్తువా లేక కోయలని చూడడానికి వచ్చిన వేగువా? చెప్పు!" అని గద్దించాడు. కనీసం ఓ ఏభైమంది కోయ మనుషులు స్త్రీ పురుషులు చుట్టూ సభలా నిలబడివున్నారు.

"ఓ దొరా! నేను వైద్యుడిని! అంటే మందులిచ్చే జబ్బునయం చేసే మనిసిని. ఎలాగో ఇక్కడికి వచ్చిపడ్డాను. నన్నొదిలేయండి! లేదా మీతో కలిసి బతకనీయండి!"

"ఇంకా అదేకూత కూస్తుండావా! నిజం చెప్పు లేకుంటే నేను అడవి మెకానికి ఆహారంగా ఈరోజే పడేస్తాం. నీకతకి ముగింపు అయిపోతది!" గద్దించాడు కిమురా!

కాని డాక్టర్ రావ్ కథకి ఇంకా ముగింపు కలగలేదు.

"దొరా ఎలా నమ్మించను నిన్ను?" అని అతనంటుండగానే

ధభ్‌మన్న చప్పుడుతో గుంపులో ఓ వృద్ధకోయ నేలమీద పడ్డాడు.

అతని చుట్టూ వున్నావాళ్ళ హాహాకారాలు చేస్తూ దూరంగా తొలగారు.

ఆ పండుముసలికి ఏమయిందో కిందపడి స్పృహతప్పాడు. నోటివెంట నురగ కాళ్లుచేతులు కొంచెం కొట్టుకోసాగాయి.

వేగంగా కదిలాడురావ్!

ముసలి కోయవాడినాడి తనచేత్తోపట్టుకుని చూశాడు.. లేదు!

చెవి అనించి ఛాతీమీద గుండె చప్పుళ్లు విన్నాడు.

'కార్డియక్ ఎరెస్ట్....' ముక్కుకింద వేలుపెట్టిచూస్తే శ్వాసగాలి రావడంలేదు.

ముసలికోయకి హార్ట్‌ఎటాక్, ఆ పైన ఆక్సిజన్ లేక ఫిట్స్ వచ్చాయి.

ఇది రావ్‌కి బాగా తెలిసిన విద్య. మెరుపువేగంతో కార్డియక్ మసాజ్ చేయ సాగాడు. నిమిషానికి 72సార్లు. మధ్యలో ముసలికోయ నోటిలో నోరుపెట్టి గాలి వూదసాగాడు. ఛాతీ ఉబ్బుతోంది!

అందరు కోయభాషలో హాహాకారాలు చేస్తూన్నారు.

కోయదొర కిమురా అరిచాడు మన వెజ్జుని పిల్చుకరండి! పసరుపోస్తాడు!'

కొందరు కోయవైద్యుడు వెజ్జుకొసం పరుగెత్తారు.. ఓ నిముషంలోనే అద్భుతం జరిగింది ముసలికోయ నిశ్చలంగా వున్నట్టేవుండి హఠాత్తుగా కదలసాగాడు.

రావ్ అతని నాడి పట్టుకుని మళ్ళీ చెవి ఛాతీకి ఆన్చి చూసాడు.

గుండె కొట్టుకుంటోంది. మూలగసాగాడు ముసలికోయ. రావ్ ద్విగుణీకృత వేగంతో కార్డియక్ మసాజ్ చేయసాగాడు.

రెండునిమిషాలకి హార్ట్ఎటాక్ వచ్చిన రోగికి పూర్తిగా స్పృహవచ్చి "కిన్నెరా! కిన్నెరా" అని పిలవసాగాడు.

చుట్టూ మూగిన కోయల ఆశ్చర్యానికి అంతులేదు.

'కిన్నెర ఆడి కూతురు! పిల్చుకరండి ఏ అడవి తేనెకొసం పోయిందో, బతికిండో లేడో సూడండి!"

చుట్టూమూగిన కోయలు 'కిన్నెరని పిల్చుకరండి!"అని ఒకరికొకరు చెప్పుకుని పరుగెత్తుతుండగానే, ముసలికోయకి పూర్తిగా స్పృహవచ్చింది. 'దాహం'అని సంజ్ఞ చేస్తే తాబేటికాయలావున్న కుండలోని నీళ్ళు నోట్లోపోశారు.

రావ్ 'కార్డియక్ మసాజ్'ఆపి లేచి నిల్చున్నాడు.

కోయల రాజు కిమూరా గద్దె దిగివచ్చాడు అతని స్థూలకాయం ఎండకి పట్టిన చెమట వూగుతున్న బొజ్జ కాలికి గల్లుగల్లుమంటున్న గజ్జెలు క్రమంగా దగ్గరికి వచ్చాయి.

"నువ్వు మంచి 'వెజ్జు'వే! ముసలికోయదొరని పేనం కాపాడినవ్! ఇదంతా ఎట్లా తెల్చు నీకు?"

రావ్ నిస్పృహతో తల పట్టుకున్నాడు.

ఇదో విచిత్రమైన పరిస్థితి. 21వ శతాబ్దం గుండె జబ్బుల డాక్టర్ తను. ఇది 18వశతాబ్దం గుండెపోటుకి కారణాలే తెలియని శతాబ్దం. వాళ్ళ ఆశ్చర్యానికి తను ఇప్పుడు ఏమీ సమాధానం చెప్పలేడు.

మరి కాసేపట్లో గల్లుగల్లుమనే గజ్జెలమోతతో కిన్నెర పరుగు పరుగున రానే వచ్చింది!

సన్నగా పొడుగా నల్లటిదేహఛాయలో వుంది ఆమె. ఆ అందాన్ని చూసి అప్రతిభుడయిపోయాడు రావ్!

అడవి దేవతలా వుంది.

ఆమె కురుల్లో అడవి మల్లె సువాసన ఆమె నడకలహోయలు, సన్నని నడుము, బలిష్టమై వంపులు తిరిగిన పిరుదులు, అడుగులు వేస్తుంటే గజ్జెలచప్పుడు.

"అయ్యా! అయ్యా! మా అయ్యకేమైంది!" అంటూ క్రిందపడిపోయివున్న ముసలికోయని ముఖం చేతుల్తో పట్టుకుని ఉపాసాగింది.

"నీ తండ్రి కేం భయంలేదు అతను స్పృహలోకి వచ్చాడు!" అన్నాడురావ్.

కోయలందరిముఖాల్లో చిరునవ్వులు వెలిగాయి.

కోయలరాజు 'కిమూరా' రావ్ని ఆలింగనం చేసుకోని "నువ్ గొప్ప 'వెజ్జు'(వైద్యుడు) వే!" అని పొగిడేడు. అతని స్థూలకాయంలోంచి కస్తూరి పరిమళాలు! కదుల్తుంటే మెడలో పూసల చప్పుడు!

"ఈయినని 'చెరశిచ్చ' నుంచి తీసుకోని మనగూడెంలోనే మంచిగుడిసె ఈయండి! మనతోటే వుంటాడు. మంచిగ బువ్వ పెట్టండి ఇకపై... నీ పేరు..!" అడిగాడు కిమూరా.

రావ్ 'నారాయణరావ్' అని బదులిచ్చాడు వినమ్రంగా

'ఆ.. నారాయణవైద్యుడు! మనతోనే వుంటాడు' అన్నాడు కిమూరా సంతోషంగా

నారాయణరావ్ ఏదో చెప్పబోయాడు. ఎంతచెప్పిన ఈ కాలగమనం, 21వశతాబ్దం నుంచి తనువచ్చిన సంగతి వాళ్ళకి అర్థంకాదు.

"సరే!" అని చేతులు జోడించాడు కాలంలో వెనక్కి తొసేస్తే మన శరీరానికి ఏమవుతుంది? వయసుఏమవుతుంది! తనకి వృద్ధాప్యం వస్తుందా యవ్వనం వస్తుందా జ్ఞాపకశక్తి ఏమవుతుంది? ఎన్నాళ్లు బతుకుతాడు?

వైద్యం వచ్చుగాని ఫిజిక్స్రాదు నారాయణరావ్కి! ఐన్స్టీన్ కాలంలో ప్రయాణం వయస్సు మార్పిడిల గురించి ఎక్కడోరాసినది చదివాడు కానీ ఏం అర్థం కాలేదు.

గ్రహాంతరవాసులు వేసిన ఈ శిక్ష తీవ్రమైనదే! క్రూరమైనదే! మళ్ళీ తన కాలంలోకి వెళ్ళే అవకాశం వస్తుందా? తను ఇక్కడే వీరి మధ్యే చనిపోతాడా! లేక అడవి బయట ఏమయినా 18వ శతాబ్దపు పట్టణాల్లో తనకి వుపాధి దొరుకుతుందా?

సమాధానం లేని ప్రశ్నలు. ప్రస్తుతానికి ఇక్కడ వుండటమే మేలు.

"రాదొరా! పుట్టతేనె ఇస్తా" అంటోంది కొయసుందరి కిన్నెర!

ఈ పిల్ల చాలు! చూస్తూ అడవిలో కాలంగడిపేయచ్చు.

రావ్ అందరికి నమస్కరించి వారు చూపిన అడవిదారివెంట గూడెంలోకి నడిచాడు.

* * *

## <u>ఆల్ఫా.009</u>

..1799....

డిగ్...డిగ్... డిగ్...

అంతరిక్షంలో అలవోకగా ఒకేవేగంతో ప్రయాణిస్తోంది ఆల్ఫా 009 అంతరిక్షనౌక

ప్లీడియస్ గెలాక్సీలోని న్యూటైటాన్ గ్రహం నుంచి బయలుదేరిందది. ఇది కాంతివేగంతోనూ, అంతకంటే ఎక్కువ వేగంతోనూ పయనించగలిగిన అంతరిక్షనౌక.

ప్లీడియస్ గెలాక్సీలోని న్యూటైటాన్ వాసులు ఖగోళజ్ఞానంలో ఆరితేరిన వారు వారికి ఎప్పుడూ అంతరిక్షంలో ప్రయణాలు సుదూరగ్రహాల అన్వేషణ, పరిశోధన ఒక హాబీ.

విజ్ఞానంలో అద్భుతమైన ప్రగతిని సాధించిన ఈ గ్రహవాసులలో ఇంకా అతిప్రతిభావంతులైన 'కాలజ్ఞానులు' అనబడే శాస్త్రవేత్తలున్నారు. వీరు కాలంలో ముందుకీ వెనక్కీ ప్రయాణించగలరు వీరికి వస్తువులని ఉత్పత్తిచేసే శక్తీ, శరీరంలోని శక్తిని లేసర్కిరణాలలా తయారుచేసి ఆయుధంలాగా వాడేశక్తీ వున్నది.

ఆల్ఫా009 న్యూటైటాన్ గ్రహంనుంచి సుదూర 'పాలపుంత' గెలాక్సీకి విశ్వ పరిశోధన నిమిత్తం బయలుదేరింది.

న్యూటైటాన్ వాసులది ప్లీడియస్ గెలాక్సీ అక్కడి నుంచి సుదూర గెలాక్సీలకి ప్రయాణించాలంటే మూడువేల కాంతిసంవత్సరాలు పడుతుంది.

అంటే కాంతివేగంలో ప్రయాణిస్తే! వారిజీవితకాలం సుమారు రెండువందల ఏళ్ళు అయితే అన్నివేల సంవత్సరాల ఎలా పయనించగలరు?

అయితే వారి గ్రహంలో అంతరిక్షయాత్రలో అద్భుతాలు సాధించారు.

కాంతివేగం కంటే ఎక్కువ వేగంతో పయనించే నౌకలు కనిపెట్టగలిగారు. వీటిని Tachyon సిస్టమ్స్ అంటారు. మామూలు అంతరిక్షంలో ప్రయాణించిన కొంతసేపటి తర్వాత

అంతరిక్షనౌకలు Hyper Space అనబడే అత్యున్నత అంతరిక్షంలోకి ఎగిసిపోయి అక్కడ కాంతివేగం కంటే ఎన్నోవేల రెట్ల వేగంతో ప్రయాణిస్తాయి.

ఆ సమయంలో అంతరిక్షనౌకలోని ప్రయాణికులు ఓ విధమైన ఘనీభవించిన కాంతిఅణువుల(Photons) స్థితిలో వుంటారు.

మళ్లీ లక్ష్యానికి వచ్చేముందు ఈ నౌకలు కాంతివేగంతో పయనిస్తాయి. అ తర్వాత తక్కువ వేగానికి దిగుతాయి.

ఇప్పుడు ఆల్ఫా009 పాలపుంతలోని సౌరకుటుంబంలోకి ప్రవేశిచింది.

ప్రవేశించినాక ఇప్పుడు కాంతివేగం కంటే కూడా తగ్గి – క్రూయిజ్ స్పీడ్ అంటే సెకన్‌కి 18 మైళ్ళవేగంతో పయనిస్తోంది.

నౌక కెప్టెను డాక్టర్ సిసిరోస్ కంట్రోల్స్ దగ్గర నిలబడి నడుం మీద చేతులుపట్టుకుని నౌకముందు భాగంలోని అద్దంలోంచి సూర్యకుటుంబం లోని అంతరిక్షాన్ని పరిశీలుస్తున్నాడు.

ఆల్ఫా009 ఎస్టెరాయిడ్ బెల్ట్‌లో వెళ్తోంది.

అటూయిటూ వేగంగా బులెట్స్‌లాగా ఆస్టిరాయిడ్స్ రాళ్లు వుల్కలు దూసుకుపోతున్నాయి.

ఒకనౌక ఎలక్ట్రానిక్ పరదా నౌక చుట్టూ నుండటం వల్ల అవి నౌకకి వందమైళ్ల దూరంలో రాగానే మాడిమసి అయిపోతున్నాయి.

సిసిరోస్ ఆలోచిస్తున్నాడు సౌరకుటుంబంలో సూర్యుడు అనే నక్షత్రం చుట్టూ తిరుగుతున్న గ్రహాలలో, నెప్ట్యూన్, యురేనస్, ప్లూటో శని గురుడు అనే గ్రహాలు దాటి ఇంకాముందుకు వస్తున్నాడు. తనకు తెలిసిన విజ్ఞానం ప్రకారం తర్వాత కుజగ్రహం రావాలి. కుజుడి తర్వాత భూమి, శుక్రుడు బుధుడు.

గురుగ్రహం దాటింతర్వాత కుజగ్రహం వరకూ చాలా కోట్లమైళ్ల దూరంవున్నది. కుజుడికీ, భూమికీ మధ్య మూడున్నర కోట్లమైళ్ళ దూరం అయితే, కుజుడికీ గురుడికీ మధ్య 37కోట్ల మైళ్ళ దూరం వున్నది.

ఇంతదూరం ఎందుకువున్నది అంటే పూర్వం ఏదో ఒక గ్రహం ఇక్కడ పరిభ్రమిస్తూ తర్వాత ముక్కలు ముక్కలయిపోయి నశించిందని శాస్త్రవేత్తలు వూహ.

అలా నశించిపోయిన గ్రహశకలాలే వలయకారంగా సూర్యుని చుట్టూ భ్రమణం చేస్తున్నాయి. ఇదే గ్రహ శకలాల వలయం (Asteroid Belt) కొన్ని వేల శకలాలు అటూయిటూ వేగంగా దాటిపోతున్నాయి. మాడిమసై పోతున్నాయి.

"కెప్టెన్ సిసిరోస్!" మెత్తటి అడగొంతు.

వెనక్కితిరిగి చూశాడు సిసిరోస్ ఓ పళ్ళెంలో క్రిస్టల్ గ్లాసులతో పళ్ళరసాలు తీసుకుని వచ్చింది జమీలా.

"ఏస్టిరాయిడ్ బెల్ట్‌లో బాగానే పోతున్నాం. మన గమ్యం ఎక్కడికి?" అన్నది జమీలా

వెనకనే జమీల్ వచ్చాడు. గిరజాల జుట్టూ కండలుతిరిగిన శరీరం నీలికళ్ళు చాలా పొడుగుగా యోధులవలె వుంటారు న్యూటైటాన్ అంతరిక్ష యాత్రికులు.

జమీలా జమీల్‌కాక వెనక నౌకలో విశ్రాంతి తీసుకుంటూ, సయ్యిదా, సయ్యద్‌లు వున్నాయి. వారు కొంత వృద్ధులు.

అందరూ శాస్త్రజ్ఞులే అందరూ అపారమైన మేధ జ్ఞానం కలవారే.

"భూమికి!" అన్నాడు సిసిరోస్ భూగ్రహంలో ప్రాణికోటి వున్నదని మనకు తెలుసు. మరికొద్ది నెలల్లో కుజగ్రహం దాటుతాం. కుజగ్రహం చూసిదాన్ని ఫోటోలు తీసినాక వేగం పెంచి భూగ్రహం చేరుకుందాం. నాకు తెలిసినంత వరకు కుజునిలో ఏజీవరాశీ లేదు. భూమిలో మాత్రం అపారమైన వాతావరణం జంతు మానవ జాతులు వృక్షాలు సముద్రాలు పర్వతాలు అన్నీ వున్నాయి. అవి చూసి బుధునిదాకా పోయి తిరిగి హైపర్‌స్పేస్‌లోకి చేరుకుంటాం. అదీ మన కార్యక్రమం."

"మన పూర్వీకులు భూవాసులు కదా నాకు ఆ గ్రహం చూడాలని వుంది. వారెలావుంటారో వారితో మాట్లాడాలని ఆశగావుంది" అంది జమీలా.

జమీల్ గొంతుసవరించి అన్నాడు మన టైటాన్ గ్రహపు ఉత్తమ భావకవి 'ట్రాంక్విల్' చెప్పిన కవిత...

***"చూస్తే భూగ్రహంలో***
***చూడాలి సూర్యోదయం***
***వింటే భూమిలో వినాలి***
***పక్షుల కలకలం***
***తడిస్తే భూమిలో తడవాలి***
***ఋతుపవనాల ప్రేమ***
***వర్షపు జల్లులలో***
***సౌదామినుల తళతళలో***
***వురుముల మృదంగధ్వనులలో***
***సాటిరాదే నేలా భూమికి....***
***దివ్యరత్నాల అందాలరాశికి!"***

***"ఆహా ఏం రాశాడు! ట్రాంక్విల్! అతను భూగ్రహం ఎప్పుడు చూశాడో?"***

"కెప్టెన్ మన న్యూటైటాన్‌లో భూగ్రహపు అభిమానులు చాలామందేవున్నారు. తరచు భూమికి విహారయాత్రలు జరుగుతూనే వుంటాయి."

"ఈ మధ్యనే కాలజ్ఞాని హోరా తన విశ్వప్రేమినౌకతో భూమినుంచి తిరిగి వచ్చాడని విన్నాను. కొడుకు కోడలూ పోలోనియా పోలోనియస్ కూడా ఆ బృందంలో వున్నారట.. ఏదో చాలా అవస్థలు పడ్డారని... 'ఇంటర్ గెలాక్టిక్ నెట్‌వర్క్' లో పుకార్లు చదివానే" సిసిరోస్ అన్నాడు గెడ్డం తడుముకుంటూ.

నేను 'న్యూటైటాన్' వార్తా యంత్రాలలో ఎలక్ట్రానిక్ పత్రికలలో అలాంటిదే చదివాను. కాని దేనికీ నిర్ధారణా లేదు. అంతా గోప్యం... నిజం తెలియదు!"

హోరా చాలా వృద్ధుడు పైగా చాలా చాదస్తుడు. ఏదీ ఎవరికీ చెప్పడు. నిజానికీ నేను ఇక్కడికి వచ్చేముందు ఆయన "విశ్వవిజ్ఞాన కార్యశాల" (Lab of Universal knowledge)కి ఫోన్‌చేసి ఆయన కోసం అడిగాను. మేం భూమికి వెళ్తున్నాం అనీ, ఏవయినా జాగ్రత్తలు చెప్పమనీ..."

"ఏమన్నాడు?" అడిగాడు జమీలా జమీర్.

"భూమి సుందరమైనదేకానీ భూవాసులు మన పూర్వీకులు అయిన మానవులు దురాశాపరులు. ధనానికీ, సంపదకీ మోహపడతారు. ధనంకోసం ఏదయినా చేయగలరు జాగ్రత్త!" అన్నాడు.

"అంటే ఆయనకి ఏం కష్టాలు వచ్చాయో!"

"అదేకాదు. భూమిలో మానవులకి వైద్యవిజ్ఞానం అపారంగా పెరిగింది.

అంతకుమించి వారి వ్యాధులుకూడ అపారంగావున్నాయి.

భౌతిక రసాయనిక శాస్త్రాల్లో కాల ప్రయాణంలో మనం గొప్పవాళ్లమయినా భూమిలోని మనకు తెలియని సూక్ష్మజీవులు వ్యాధులు, మందులు ఇలాంటి వాటివల్ల చాలా ప్రమాదం జాగ్రత్త. అక్కడికి వెళ్ళేందుకు ముందు ఆ విషయాలు అన్నీ తెలుసుకుని వెళ్ళడం మంచిది!" అన్నాడు.

"కెప్టెన్! హోరా కాలజ్ఞాని చెప్పాడంటే అదినిజమే అయివుంటుంది. మనం అసలు భూమిలో దిగడానికి పోవడం లేదుకదా, ఈసారి అంతరిక్షం నుంచి ఫోటోలు తీసి, తర్వాత ఒక తగిన స్థలం చూసుకుని అక్కడ దిగి పర్యటించాలని కదా మన కార్యక్రమం!"

"అవును జమీల్, భూమికి 1000మైళ్ల దూరంలో విహరిద్దాం ఆ ORBIT లోంచి భూమిని పరిశీలిద్దాం తర్వాత ఒక స్థలాన్ని ఎన్నుకుందాం.

... ఇప్పుడు కాల ప్రయాణంలో మనం ప్రయాణించే వేగానికి భూమి 18వ శతాబ్ధంలో వుంటుంది.

ఈ శతాబ్ధంలో భూమిలో జనాభా తక్కువ! అరణ్యాలూ, పర్వతాలూ ఎక్కువ. విజ్ఞానం ఇంకా ప్రాథమిక దశలోనేవుంది. మనం ఒకవేళ భూమిలో విహరించినా మనకే ప్రమాదం రాదు" సిసిరోస్ నవ్వుతూ అన్నాడు.

కేబిన్ తలుపుని తన ఏంటెన్నాతో తీసుకుని లోపలికి ప్రవేశించింది. 4 అడుగుల ఎత్తు యాంత్రికమైన అడుగులూ, కంఠస్వరంతో... రోబట్ సఫైర్ "మాస్టర్! ఏస్టిరాయిడ్ బెల్ట్ మరోగంటలో దాటేస్తాం. రెండురోజుల్లో కుజగ్రహం మీదుగా రెండువేళ మైళ్ళ దూరంతో ప్రయాణించగలం కాని కుజగ్రహంలో దిగడానికి మనకు వీలుకాదు!"

"ఔను!" అన్నాడు సిసిరోస్ గంభీరంగా "కుజునిలో జీవరాశి లేదు. ప్రస్తుతం భయంకరమైన తుఫానులు వస్తున్నాయి."

"కుజుడిని దాటిన తర్వాత మూడుకోట్ల మైళ్ళదూరంలో భూమి వున్నది. అది మన ప్రస్తుత వేగంబట్టి నాలుగునెలల్లో చేరుకోగలం భూమి కక్ష్యలోకి ప్రవేశించినాక –మనం ఏ ప్రాంతంలో దిగాలో ఎక్కడ విహరించాలో నిర్ణయిద్దాం" అన్నది సఫైర్.

"సఫైర్! నీకింకా ప్రణాళిక సిద్ధంకాలేదా! ఇంకా ఎప్పుడు ఆలోచిస్తావ్!"

"మాస్టర్! ప్రణాళిక వున్నది! భూమధ్యరేఖ దిగువన $27^{1/2}$ అక్షాంశ దగ్గర ఒక విశాలమైన మైదానం వున్నది. ఇక్కడ విశాలమైన గంగా, యమునా నదులు ప్రవహిస్తున్నాయి. మానవ నాగరికత 18వ శతాబ్ధంలోవున్నది. అక్కడ దిగాలని నా డిస్క్‌లో ప్రోగాం చేయబడి వున్నది.

....కాని చివరినిముషంలో.. ఏమయినా మార్పులు జరగచ్చుకదా! అందువల్ల మాస్టర్! ఫైనల్ ప్లాన్ 'మార్పులకి' లోబడి వుంటుంది!"

"ఓ! సఫైర్ నీమాటే అధికారికం! ఏస్టిరాయిడ్ వలయం తప్పించుకున్నాం.. ఇక పదండి కొంచెం భోజనం చేద్దాం."

జమీల్ మళ్ళీ కవిత్వం చెప్పాడు. అతనో భావుకుడు

***"అంతరిక్షంలో ఏది పగలు?***

***ఏది రాత్రి?***

***ఏది ఉదయం?***

***ఏది సంధ్య?***

***సాయంత్రాల్లేవు***

***మధ్యాహ్నాలు లేవు***

***రోజుల పొడుగులు***

***ప్రతిగహానికి వేరు***

***సంవత్సరాలు కుంచించుకుపోయి***

***అస్తమయాలు అదృశ్యం అయి***

***కాలానికి కొలతలేదు***

***అంతా సాపేక్షం!"***

"చాలు జమీల్ నీ కవిత్వం చాలు. మరో రెండొందల ఏళ్ళలో భూమానవులు ఐన్‌స్టిన్ రూపంలో కనిపెట్టబోయ్యే సాపేక్షసిద్ధాంతం నువ్వు ఇప్పుడే పాటగా పాడుతున్నావ్. ఇవన్నీ మన టైటాన్‌లో ఎప్పుడో నేర్చుకున్నాం..పద! లంచ్ తిందాం!" కెప్టెన్ జమీల్, జమీలా.. అంతరిక్షనౌకలోని మధ్యగది– భోజనశాలలోకి నడిచారు. వాళ్ల ఆకారాలు మానవాకారాల వలెనే వున్నాయి. శరీరనిర్మాణం అంతా అదేతీరు. ఆకలీ దప్పులూ అనుభూతులూ అన్నీ అవే.

ఎందుకంటే వారు ఎన్నో తరాలక్రిదంటి మానవజాతి నుంచి ఆవిర్భవించి, సుదూర గెలాక్సీలలో స్థిరపడిన వారు.

ఎటొచ్చీ మనుష్యులకీ వీళ్లకీ తేడా, ఏమిటంటే వారి మేథ అద్భుతం, శరీరపు శక్తి ఉన్నతం, విజ్ఞాన ప్రగతి అపూర్వం... మన 21వశతాబ్ధపు భూవాసులతో పోలిస్తే!

వారు ఒక పాలరాతి రంగులో వున్న టేబుల్ చుట్టూ కూర్చొని భోజనం అరగిస్తుంటే

అంతరిక్షనౌక యొక్క ఒక ఎలక్ట్రిక్ ప్లగ్‌లో తన ఏంటెన్నాను దూర్చి రీచార్జ్ చేసుకోవడంలో నిమగ్నమయింది. సఫైర్ రోబట్.

డిగ్... డిగ్... డిగ్.. అంతరిక్షనౌక ఆస్టిరాయిడ్ బెల్ట్‌దాటి కుజగ్రహం వైపు పయనిస్తోంది.

ఇప్పుడు చుట్టూ అంతా స్థబ్దత.... కాని పదివేలమైళ్ల దూరాన ఒక పెద్ద గ్రహశకలం వేగంగా పరిభ్రమిస్తూ సరిగా ఆల్ఫా009 అంతరిక్షనౌక వైపే ప్రయాణిస్తూ వస్తోంది. ... అటూయిటూ వందమైళ్ళ వ్యాసం వున్న శకలం అది.

దానిలో వందమైళ్ళ వ్యాసంలో సుమారు సగానికి పైగా వ్యాపించి వుంది ఆ తెల్లటి ద్రవ్యపదార్థం.

"కొన్ని లక్షల "ఆర్ఎన్ఎ" న్యూక్లియర్ ఏసిడ్ వున్న వైరస్‌కణాల ముద్ద. అది బతికి బట్టకట్టాలంటే దానికి డిఎన్ఎ కావాలి. మరోక జీవించివుండే కణం కావాలి.

దానికి మెదడులేదు. ఫీలింగ్స్ లేదు. కోపంలేదు. ప్రేమలేదు. కావల్సిందిఒకటే ఒక "హోస్ట్"

ఏ అంతరిక్ష గెలాక్సీ ప్రయాణవాసులో ఎక్కడినుంచో ఎక్కడికోపోతూ ఈగ్రహశకలానికి అంటించారో లేక మనకు తెలియని రసాయనిక ప్రక్రియవల్ల ఆ గ్రహశకలంలో స్వయం భువుగా పుట్టి పెరిగిందో కానీ అది ఓ వైరస్ పరాన్నజీవి. బాక్టీరియాలాగా దీనికి స్వంతంగా బతికే నేర్పులేదు.

కణకణానికీ అర్ఎన్ఏ, డిఎన్ఏ రెండూ వుండాలి కణాలు బతికి బట్టకట్టాలంటే....

ఇది ఆర్ఎన్ఎ వైరస్‌కనుక దానికి డిఎన్ఎ వున్న కణం కావాలి. అది ఆధారంగా బతకాలి.

అది దానికోసమే వెతుకుతోంది. గ్రహశకలంలో ఆ తెల్లటి ద్రవ్యరాశి ఓ భయంకరమైన

అంతరిక్షవైరస్ మహమ్మారికి నెలవుగా వుందని ఎవరికి తెలుస్తుంది!

ఇప్పుడు గ్రహశకలం, సరిగ్గా ఆల్ఫా009 అంతరిక్షనౌక వస్తున్న మార్గంలోనే వేగంగా అతివేగంగా అదే "TRAGECTORY(కక్ష్య)"లో పయనిస్తోంది.

... అతి త్వరలో... అతిత్వరలో అని ఆర్ఎన్ఏ వైరస్‌కణాలు అర్రులు చాస్తున్నాయి.. ఎదురుచూస్తున్నాయి.

అనంతవిశ్వం.... పాలపుంత.... గెలాక్సీ సౌరకుటుంబం, గురునికీ కుజుడుకీ మధ్య దారిలో ప్లేడియస్ గెలాక్సీ నుంచి వచ్చిన ఆల్ఫా009 యాదృచ్ఛికంగా తనతో తలపడుతున్న పేరులేని గ్రహశకలం వైపే వేగంగా భయం లేకుండా ప్రయాణిస్తోంది అదే కక్ష్యలో

డిగ్... డిగ్... డిగ్...

* * *

"ఓ... దొరా! అన్నది కిన్నెర.

ఆ కోయపిల్ల గొంతులో అడవి కోకిల స్వరం పలుకుతోంది.

గుడిసెలో ఓ పీటమీద కూర్చుని మరోపీటమీద ఒక నల్లటిరాతి చిప్పలాంటి పాత్రలో ఆకులు కషాయంలా నూరుతున్నాడు డాక్టర్‌రావ్.

వృత్తికి వైద్యుడు 21వశతాబ్దపు వైద్యంలో నిపుణుడు ప్రయోగాత్మక కార్డియాలజీలో పరిశోధన చేసినవాడు. గొప్ప విజ్ఞానం సంపాదించినా దానిని స్వప్రయోజనం కోసం వాడుకున్న వాడూ అతను.

జ్ఞానం కత్తిలాంటిది. దాన్ని మంచికీ చెడుకీ కూడా ఉపయోగించవచ్చు.

పొడిచితే ప్రాణాలు తీయచ్చు. శస్త్రచికిత్సలో శరీరాన్నికోసి ప్రాణం కాపాడవచ్చు.

రావ్ ఫిలాసఫీ అదికాదు. నా విజ్ఞానం నాకు కొన్ని శక్తులు ఇస్తే వాటిని వుపయోగించుకొని నాకు కావల్సిన డబ్బు సంపద సంపాదిస్తే తప్పేమిటి అని. అయితే దురాశ, క్రూరత్వం అనుకున్న దాన్ని సాధించడానికి విలువల్ని వదులుకోవడం, ఇవన్నీ రావ్ చేశాడు. చాలావరకు కలిసి వచ్చింది. కాని ఏదో ఒక క్షణంలో అనుకున్నది అవదు. వుందోలేదో అనుకున్న విధి వక్రించి ఒక్క దెబ్బకొడుతుంది. ఎవరు ఎక్కడ ఎప్పుడు కొట్టారో తెలీకుండా పాతాళంలోకి పడిపోయాడు.

అయినా అతని అంతర్లీనంగా వున్న పట్టుదల చావలేదు.

ఈ అడవిలో నాగరికతలేని కోయల మధ్య జీవనం మొదలుపెట్టాడు. తనకిష్టమైన వైద్యం వీళ్ళెలా చేస్తారో కుతూహలంగా పరిశీలిస్తున్నాడు.

వాళ్ల డాక్టర్ని 'వెజ్జు' అంటారు. ఆ ముసలి వెజ్జుదగ్గర వున్న ఆకుపసరులు చెట్లవేళ్లు గింజలు విత్తనాలు కొమ్మలు మొక్కలు ఏవి దేనికి వాడతాడో ఈ పదిరోజుల్లో గమనిస్తూవచ్చాడు.

మాములు జ్వరానికి ఒక ఆకు కాషాయం, చలి జ్వరానికి మరొక చెట్టువేరు, పాముకాటుకు ఒక చెట్టు బెరడు లేహ్యంగా చేసిపోయడం. ఆయాసానికి కొన్ని ఆకులు...

స్వతహాగా గుండె జబ్బుల డాక్టరు కాబట్టి ఆయాసానికి గుండెనొప్పికీ వాళ్ళ 'వెజ్జు'వాడే ఆకులన్నీ తెలుసుకున్నాడు.

ఈరోజు వాటిని ఒక కాషాయంలాగా నూరుతూ కూర్చున్నాడు.

అప్పుడు పిలిచింది కిన్నెర గొంతు అడవికోయిలలాగా.

ఎర్రటి అడవిపూలు తలలో తురిమింది. నల్లటి పొడుగైన జుట్టు పిరుదుల దాకా వదులుగా వేళ్ళాడదీసింది. నల్లటి నిగనిగ రంగులో కొద్దిగా చెమటపట్టిన శరీరం నీరెండకి తళుక్కున మెరుస్తోంది. బలిష్టంగా పటువుగా కనిపిస్తోన్న వక్షోజాల మీదుగా రంగురంగుల పూసలదండలు నీలిరంగు 'బ్రా'లాంటిది ధరించింది.

నడుం నగ్నంగా వుంది. 'మినీశారీ' లాంటిది. మోకాళ్ళదాకా కట్టుకుంది. అ చీర చుట్టూ ఏవేవో పూసల హారాలు. కాళ్ళకి తెల్లటి ఇత్తడి గజ్జెలు నడుస్తోంటే ఘల్లుమంటున్నాయి.

"ఓ దొరా! ఏం చేస్తుండవ్? నామాట ఇను కొంచెం!" అన్నది.

"చెప్పు కిన్నెరా" అన్నాడు రావ్ తలఎత్తి. నల్లటి ఈ అడవిపూవు అందం మనసు మత్తెక్కించేట్టుంది. మధ్య వయసు శరీరంలో అణగారినకోర్కెలు ఝల్లుమని బుసలు కొడుతున్నాయి.

"కానీ, మనసులో జాగ్రత్త! దేశం కాదు, కాలం కాదు, కోపం వస్తే తలతీసేస్తాడు కోయదొర కిమూరా!

"ఓ వెజ్జుదొరా! నువు అందరికీ మందులు ఇస్తావుంటివికదా. నీకియన్నీ ఎలా తెలుసు గూడెంలో అందరికీ బలే వింతగావుంది. నువ్విచ్చిన మందులకి పసరులకి చలిజ్వరాలు ఒక్కరోజులో తగ్గిపోతుండాయి!"

"నేను చెప్పానుగా. నేను డాక్టర్ని అని"

"నీకు పిచ్చి అనీ, దయ్యం పట్టిన మనిషనీ కొందరు అంటున్నారు లేకుంటే ముందు కాలంనుంచి మాకాలం వచ్చినావని చెప్తున్నావ్‌కదా అలాంటోడు మతిభ్రమించినోడే అంటున్నారు!"

రావ్‌కి కోపం వచ్చింది "ఎలా చెప్పేది కిన్నెరా. సరే! ఏమిటి విషయం ఇంత పొద్దున్నే వచ్చావ్?"

కిన్నెర గోముగా అంది "నిన్ను చూడాలని దొరా!" ఆ నల్లని కళ్ళల్లో తళుక్కుమని మెరుపు. మబ్బుపట్టిన ఆకాశంలో విద్యుల్లతలాగా.

రావ్‌కి కొంచెం సంభ్రమం కొంచెం సంతోషం వయసులో పెద్దవాడిలా కనిపిస్తున్న తనని చూసి ఈ కోయపిల్ల ఇంతమురిసి పోతుందేమో!

తనలోకూడా ఎప్పుడో అణిగిపోయిన ప్రేమభావంతో.. ఉద్రేకం.. మళ్ళీ.. ఇప్పుడు.. ఎలా..?

ఆలోచిస్తూ తల తడుముకున్నాడు. ఆశ్చర్యం... పల్చబడిన వెంట్రుకలతో నున్నగా తగలాల్సిన తలకాకుండా వొత్తుగా తనకి పాతికేళ్ళ వయసులో వున్న వుంగరాలజుట్టు తగుల్తోంది.

వింతగా తన చేతులకేసి చూసుకున్నాడు. ముడతలుపడి పచ్చటి సిరలు కనిపించాల్సిన చేతులు బలిష్టంగా చామన ఛాయతో నల్లటివెంట్రుకలతో నిగనిగలాడుతున్నాయి.

గబగబ పొట్టతడుముకున్నాడు. పూబకాయ పొట్టలేదు. పాతికేళ్ళ యవ్వనంలో వ్యాయమం చేసి గట్టిపడిన కండరాల్తో పొట్ట బలంగా తగిలింది.

ఏదో తనకు తెలియని విచిత్రమైన విజ్ఞాన శాస్త్ర సిద్ధాంతాల ప్రకారం తన వయస్సు ఒక ముప్పైఏళ్లు వెనకి వెళ్ళిందా? కాలప్రయాణం వల్ల కాలంలో వెనక్కి తోయబడటం వల్ల

తనకీ యవ్వనం తిరిగి వచ్చిందా!
అందుకేనా ఈ పడుచుపిల్ల తనని ఆకర్షణగా ఆరాధనతో చూస్తోంది!
"కిసుక్కున నవ్వింది కిన్నెర "దొరా ఏంటో ఆలోచనలో పడ్డావ్! వొళ్ళంతా చూసుకుంటున్నావ్ నీకేమయింది దొరా? ఎందుకట్లయినవ్!"
రావ్ నరాల్లో విద్యుత్ ప్రవహించసాగింది. ఇన్ని కష్టాలమధ్య ఒక సుఖం ఇన్ని నిరుత్సాహాల మధ్య ఓ నూతన ఉత్సాహం.
"కిన్నెరా!" అని ఆ పిల్ల చేతులు పట్టుకున్నాడు!"
"ఊఁcc.. ఊఁcc" అంది గోముగా కిన్నెరా
వొద్దన్నట్లుగానే విదిలించుకోబోతోంది కాని, దూరంగా పోవడం లేదు.
రావ్ నవనాడులు నూతన యవ్వనంతో విజృంభించాయి. కిన్నెరని రెండు చేతులతో దగ్గరికి లాక్కున్నాడు.
అడవి మల్లెల పరిమళం, కస్తూరి వాసన బిగుతైన పడుచు వక్షోజాల స్పందన ఆమె పెదవులపై చుంబించినప్పుడు కాలం ఆగిపోయి స్వర్గం చేరువలో వున్న అనుభూతి.
బిగికౌగిలి స్పందన ఆ గుడిసెలో ఓ మూలనే వున్న నులకమంచం మీదకి ఆమెని లాక్కుంటూ తీసుకుపోవడం తన శరీరంలో మరచిపోయిన శక్తి. ఆరిపోయిన నిప్పు తిరిగి ప్రజ్వలించినట్లు కన్నె అందాలు తనివితీరా ఆస్వాదిస్తున్నాడు. రెండు శరీరాలు అడవిలో వేడికి , మబ్బులుపట్టినప్పుడు, ఉరుములు ఉరిమినప్పుడు లయబద్ధంగా నృత్యం చేసే నెమళ్ళలాగా పురివిప్పి నాట్యం చేస్తున్నాయి.
మరో ఐదునిమిషాల ఉన్మత్త ఆనందం తర్వాత ఇద్దరూ ఆగిపోయి ఒకరి కళ్ళలోకి ఒకరు నవ్వుతూ చూసుకుంటున్నారు.
అతను ఆమెపైన, ఆమె అతని కౌగిలిలో
పొంగి పొరలిన వరద తగ్గుముఖం పట్టి తృప్తిచెందిన నది మళ్ళీ మెల్లగా ప్రవహిస్తున్నట్లు, ఎగిసిపడిన ఉచ్ఛ్వాసనిశ్వాసాల జోరుతగ్గి మళ్ళీ నాడి వేగంతగ్గి ఇద్దరూ సంతోషంగా ఒకరికేసి ఒకరు చూసుకున్న క్షణాలు.
"... నువ్వే నా మంచి దొరవి! నీవే నా పెనిమిటివి! నా దొరా!" గాఢంగా ముద్దాడింది కిన్నెర.
ఆ విచిత్రపరిస్థితికి తలమునకలైన రావ్ నల్లటి ఆ కనురెప్పలని మృదువుగా ముద్దాడాడు.
అప్పుడు వినబడింది గుడిసె బయట అడుగుల చప్పుడు మాటల కలకలం నవ్వులూ – కేరింతలూ.
ఓ క్షణం రావ్‌కి గుండె అగినట్లనిపించింది.
ఎవరో వస్తున్నారు.. ఇప్పుడేలా!

* * *

ఆల్ఫా009లో డైనింగ్ టేబుల్ దగ్గర కెప్టెన్ డాక్టర్ సిసిరోస్ జమీలా, జమీల్, సయిదా సయ్యద్ భోజనం ముగించి, నౌక అంతర్భాగంలో వున్న చిన్న చిన్న బెర్త్‌లాంటి మంచాల మీద విశ్రాంతి తీసుకుంటున్నారు.
నౌక గోడమీద టి.వి.తెరలాంటి తెరమీద మధురమైన హిందుస్థానీ సంగీతం అలాపిస్తున్న తలపాగా వ్యక్తి దృశ్యం కనిపిస్తోంది. అతని వెనక తబలా సారంగీ వాయిస్తున్న ఇద్దరు గడ్డం మనుషుల ఆకారాలు కనిపిస్తున్నాయి. మధుర సంగీతం ఆల్ఫా009 అంతా వ్యాపించివుంది. భూవాసులసంగీతం ఎప్పుడో టైటాన్‌లో రికార్డు చేసుకున్నది కొనుక్కుని తెచ్చుకున్నాడు సిసిరోస్
"భూవాసులు ఎలాంటి దురాశా పరులైనా, వారిలో వున్న ఈ కళాతృష్ణ, సంగీతం, చాలు వారిని క్షమించేయడానికి అద్భుతమైన సంగీతం ఈ విశ్వం అంతటిలోకీ అతిగొప్పది వీరి భారతీయ సంగీతం!"
జమీల్ అన్నాడు కళ్లు సగం మూసుకుని కలలోలాగా

***"సంగీతమే కాదు సాహిత్యం కూడా***
***సుమధురం సలలితం సుసంపన్నం***
***భూమికి అందం తెచ్చే***
***వారి శిల్పకళ చిత్రకళ***
***గాలితరంగాలలో మనసుపులకించే***
***ఆలాపనా***
***మహోన్నతమైన కావ్యాలో***
***గ్రంథాలూ నాటకాలూ***
***వారి కళాపిపాసకి ఎల్లలే లేవు!"***

16వ శతాబ్దపు 'రినైసాన్స్' తర్వాత భూమిలో నాగరికత వెల్లివిరిసింది. 17వ శతాబ్దంలో ఢిల్లీ దర్బారులో అద్భుతమైన హిందుస్థానీ సంగీతం తాన్‌సేన్‌లాంటి మహావిద్వాంసులు సృష్టించినదీ, ఇంగ్లాడులో షేక్స్పియర్ అద్భుతమైన నాటకాలూ రచించిన రోజులు...
రోములో లినార్డో డావిన్సీ మహాద్భుతమైన శిల్పకళని ఆవిష్కరించి, చర్చిలు నిర్మించిన తర్వాతి శతాబ్దం.
జమీల్ ఇవన్నీ విని, టైటాన్ పేపర్లో చదివి, పులకించి ఆ మాట అన్నాడు.
జమీలా అంది "మళ్ళీ నువ్వు కవిత్వంలోకి జారుకోక! జమీల్ ముందు కేబిన్‌లో కంట్రోల్సుచూడు! కెప్టెన్ కొంచెం విశ్రాంతి తీసుకుంటారు!"
జమీల్ ఇంకా తన భావావేశంలోంచి తేరుకోలేదు. "ఎన్ని దుర్లక్షణాలున్నా, దురాశలున్నా క్షమించేయచ్చు మానవజాతిని. వారి మధుర సంగీతకళ చాలు చిత్రలేఖనం శిల్పకళా చాలు. వూహల వూయలలో సృష్టికర్తతో తాదాత్మ్యం చెందే వారి కావ్యాలూ పురాణాలూ చాలు! "వారిని క్షమించి ప్రేమించేయవచ్చు"
'ఐ, ఐ మాస్టర్" అంది రోబట్ సఫైర్, తన రీఛార్జింగ్ అప్పుడే ముగించుకుంది. ఇప్పుడు సఫైర్ తలలో కళ్లు ఆకుపచ్చగా మళ్ళీ మిలమిలా మెరుస్తూన్నాయి. దాని యాంత్రిక ఛాతీమీద మిలమిలా చిన్న చిన్నలైట్లు మెరుస్తున్నాయి. తలలోని ఏంటెన్నా అటూయిటూ తిరుగుతోంది.
"కెప్టెన్ నేను ఛార్జింగ్‌లో వుండగా "పవర్ ఆఫ్"లో వున్నాను నౌక ప్రయాణించే మార్గంలో ఏ అటంకాలు వున్నాయో చూడలేదు!
మీరు కంట్రోల్ దగ్గర వుండటం మంచిది. అసలే గ్రహశకలాల వలయం (Asteroid Belt)లో వున్నాం మరొక పదిలక్షల మైళ్లు ఇంకా గ్రహశకలాలు వున్నాయి. నేనుమళ్ళీ వెళ్ళి ట్రాజెక్టరీని చెక్ చేస్తాను!" అంది.
సిసిరోస్ అన్నాడు "కొంచెం బడలికగావుంది జమీల్ జమీలా మీరు ఇంజన్ కేబిన్‌లోకి వెళ్ళండి కొంచెం విశ్రమిస్తాను."

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=718**

* * *

**Read other books of Dr. Chittarvu Madhu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=169**